క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బి.కొత్తకోట: తంబళ్లపల్లి నియోజకవర్గంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక డిస్కం ఏఈ గిరిబాబు శుక్రవారం తెలిపారు. బురకాయలకోట 132 విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లి మండలాలకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ వారి సహకారంతో ఆదివారం బి.కొత్తకోటలోని చైతన్య స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ అన్ని రకాల క్యాన్సర్, గుండె, కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

13న షబేబరాత్ పండుగ

మదనపల్లె సిటీ: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే షబేబరాత్ పండుగ ఈ నెల 13వ తేదీన జరుపుకోవాలని మదనపల్లె ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్‌అహ్మద్ తెలిపారు. ఖబ్రస్థాన్ వెళ్లి మృతి చెందిన పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేయాలన్నారు. ముస్లింలు అందరూ ఈ పండుగ రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు.

నూతన నియామకం


ముకుంద

బి.కొత్తకోట: బీజేపీ మండల నూతన అధ్యక్షునిగా మేడా ముకుంద బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఎన్నికల అధికారి గోరంట్ల రమేష్, పరిశీలకులు ప్రశాంత్ ఎన్నిక జరిపారు. ఈ సందర్భంగా ఏకాభిప్రాయంతో ముకుందను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శీలంరంగారెడ్డి, రవీంద్ర, రాజారెడ్డి, సాయిప్రసాద్, మురళీ, మంజునాథరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

రాయితీ యూనిట్లు మంజూరు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ముస్లింలు, క్రిస్టియన్ మైనారిటీలకు 25 రాయితీ యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ ధనుంజయులు

మదనపల్లె: మండల రెవెన్యూ తహసీల్దార్‌గా ధనుంజయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఖాజాబీని, నిమ్మనపల్లెకు, అక్కడ పనిచేస్తున్న ధనుంజయులును మదనపల్లెకు డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. అయితే తహసీల్దార్ ఖాజాబీ, నిమ్మనపల్లె మండలంలో తహసీల్దార్‌గా చేరేందుకు సుముఖత చూపకపోగా, ఆరోగ్యం బాగ లేదని సెలవుపై వెళ్లింది. దీంతో నిమ్మనపల్లె తహసీల్దార్ ధనుంజయలకు మదనపల్లె ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాల గడువు పొడిగింపు

నిమ్మనపల్లె : సబ్సిడీ రుణాల గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12వ తేదీ వరకు పొడిగించిందని ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా ఇతర కార్పొరేషన్ల రుణాల గడువు ఈనెల 12వ తేదీ వరకు పొడిగించిందన్నారు. కార్పొరేషన్ల కింద అందిస్తున్న రుణాలు లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వయస్సు 21–60 ఏళ్ల మధ్య ఉండి, తెల్ల రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, ఫోటో తో అర్హులైన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యా సామగ్రి అందజేస్తున్న పూర్వపు విద్యార్థి సురేష్

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వపు విద్యార్థి కరాటే సురేష్ పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. పదో తరగతి పరీక్షలు రాసే 40 మందికి రైటింగ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్సు, పెన్సిల్, పెన్నులు అందించారు. ఏటా సురేష్ పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్నారని హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. ఉపాధ్యాయులు మునినాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, అబ్దుల్‌జబ్బార్, శ్రీనప్ప, బాలవరప్రసాద్, మోహన్, చంద్రశేఖర్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కూటమికి కనిపించని గుంతలు

- అధ్వానంగా రోడ్లు
- వాహనదారులకు ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం


కనికలతోపు–ఉలవలవారిపల్లె రోడ్డు


అధ్వానంగా బడికాయలపల్లి రోడ్డు దుస్థితి


పత్రవారిపల్లె–తుమ్మనంగుట్ట రోడ్డు

బి.కొత్తకోట: 'సంక్రాంతి లోపు రహదారులపై గుంతలను పూడ్చేస్తాం.. గత ప్రభుత్వం గుంతలపై తట్టి మట్టి వేయలేదంటూ' ఆర్భాటం చేసిన కూటమి ప్రభుత్వ నేతలు బి.కొత్తకోట మండలంలోని తారు రోడ్ల నిండా గుంతలు కనిపిస్తున్నా వారికి మాత్రం కనిపించలేదేమో. ప్రయాణికుల అవస్థలు పట్టని ప్రభుత్వం.. గుంతలను పూడ్చే ప్రక్రియ ప్రకటనలకే పరిమితం చేసిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా బి.కొత్తకోట–బడికాయలపల్లి–స్టేట్ బార్డర్ రోడ్డును ఎవరైనా చూసినా, దానిపై ప్రయాణించినా ప్రయాణాలపైనే విరక్తి కలుగుతుంది. ఇంత అధ్వానమైన రహదారి మరొకటి ఉండదని ఎవరైనా అంటారు. మరి ఈ రోడ్డుపై కూటమి ప్రభుత్వం తట్టి మట్టి కూడా వేయలేదు. కనీసం అధికారులు ఈ రహదారి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఐదు కిలోమీటర్ల రహదారి ప్రయాణం ఎన్ని నిమిషాలు పడుతుందో అందరికీ తెలుసు. ఈ రోడ్డు దాటాలంటే కనీసం 30 నిమిషాలు పడుతుంది అంటే రహదారి పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. ఇదే విధంగా బి.కొత్తకోట–మదనపల్లె రహదారి నుంచి జాతీయరహదారి కనికలతోపు వరకు ఉన్న తారురోడ్డు పేరుకే తారురోడ్డు తారు లేచిపోయి అడుగులో గుంత పడి రాకపోకలకు ఎన్ని కష్టాలు పడుతున్నారో ప్రజలకు తెలుసు. చాలా చోట్ల తారు మీటర్ల కొద్ది లేచిపోయింది. మళ్లీ అక్కడే గుంతలు, కొన్ని చోట్ల కోసుకుపోయిన రోడ్డు ఇలా రోడ్డంతా గుల్లగా మారింది. అయినా ప్రభుత్వానికి, అధికారులకు ఈ రోడ్డు కనిపించలేదు. ఇలాగే మరో రోడ్డు బి.కొత్తకోట–మదనపల్లి రోడ్డు (పత్రవారిపల్లి) నుంచి ఆకులవారిపల్లి, గుంతావారిపల్లి మీదుగా జాతీయరహదారి తుమ్మనంగుట్ట వరకు ఉన్న తారు రోడ్డు. ఈ రోడ్డుపై పలుచోట్ల గుంతలు, పలుచోట్ల లేచిపోయిన తారుతో గుంతలు పడ్డాయి. ఈ రహదారి మరమ్మతులు లేదా గుంతలను పూడ్చ లేదు. ఇలా మండలంలోని రహదారులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టరూ..!


మోతీనగర్‌కు వెళ్లే రోడ్డుపై పగుళ్లు

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని మోతీనగర్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పగుళ్లు ఏర్పడంతో వాహనదారులతో పాటు పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో నిత్యం బాలికల హైస్కూల్, హాస్టళ్లు, ఐసీడీఎస్, మెప్మా కార్యాలయాలకు నిత్యం ప్రజలు వెళుతుంటారు. ఈ రోడ్డు అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

● ఊరి పేరే మార్చేశారు..!



కనికలతోపు వద్ద గొల్లపల్లె పేరుతో బోర్డు

ఒక్కో ఊరికి ఒక్కో పేరుంటుందని అందరికీ తెలుసు. అయితే జాతీయ రహదారులశాఖ అధికారులైతే ఏకంగా ఒక ఊరు పేరునే మార్చేశారు. ఆ వివరాలు ఏమంటే.. బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్ట పంచాయతీ కనికలతోపు జాతీయ రహదారిపై ఉంది. రోడ్డుకు ఇరువైపులా ఊరు ఉంటుంది. అయితే ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు కనికలతోపు ముఖద్వారం వద్ద కనికలతోపు అనిపేరుతో బోర్డు పెట్టాల్సి ఉండగా గొల్లపల్లె అని బోర్డు పెట్టారు. ఎవరైనా గొల్లపల్లెకు వెళ్లాల్సిన వాళ్లు ఆ ఊరు ఇదే అనుకుని దారి తప్పుతారు. కనికలతోపు తెలిసిన వాళ్లకు ఇబ్బంది లేదు.. కొత్తవారు ఈ ఊరు ఎక్కడుందని చక్కర్లు కొట్టాల్సిందే. అధికారులు స్పందించి పేరు మార్చాల్సి ఉంది. –బి.కొత్తకోట

గోప్యంగా పేరెంట్స్ మీటింగ్

అంతా రహస్యమట!


సమావేశానికి హాజరైన పేరెంట్స్, టీచర్లు

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సోషల్ ఆడిటింగ్ బృందం తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశం నిమిషాల్లో ముగించి మమ అనిపించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మొదలైన సోషల్ ఆడిటింగ్ వ్యవహారంలో పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు కేజీబీవీల్లో జరిగిన ఆడిటింగ్‌లో అక్రమాలు, ఉపాధ్యాయుల వ్యవహారశైలి, బాలికలు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి రావడంతో ఇద్దరు ఎస్‌వోలు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో గోళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన ఆడిట్, విద్యార్థినులతో జరిగిన సమావేశం మీడియాకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పేరెంట్స్‌తో సమావేశం నిర్ణయించారు. హైస్కూల్‌లో మొత్తం 244 మంది విద్యార్థులుంటే దీనికి హాజరైంది 25 మంది విద్యార్థుల తల్లిదండ్రులు. దీనితో సమావేశం వాయిదా వేస్తామని లేదంటే సాయంత్రం వరకు వేచి చూస్తామని చెప్పిన ఆడిటింగ్ సిబ్బంది తర్వాత ఏమైందో కానీ సమావేశం ప్రారంభించారు. మొదట పదిమంది తల్లిదండ్రులతో మొదలు పెట్టగా ఒక్కొక్కరుగా 25 మంది వచ్చారు. ఈ సమావేశాన్ని తరగతి గదిలో తలుపులు మూసేసి నిర్వహించారు. అది కూడా నిమిషాల్లోనే ముగించారు. పీటీఎం, ములకలచెరువుల్లో బహిరంగంగా అందరికీ తెలిసేలా నిర్వహించారు. ఇక్కడ మాత్రం గోప్యంగా వ్యవహరించి, సమావేశం ముగించారు. ఈ విషయమై ఆడిటింగ్ ప్రతినిధులను ఆడిట్ అంశాలపై వివరాలు కోరగా అంతా రహస్యం, ఎవరికీ చెప్పమని స్పష్టం చేశారు. అయితే ఇక్కడ నిధుల వినియోగం, మధ్యాహ్న భోజనం పథకం, ఇతర అభివృద్ధి పనులు, ఉపాధ్యాయుల పనితీరు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటన్నవి బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడ్డారు. విలేకరులు అడక్కపోయినా కొంత మంది అంతా బాగుంది అని చెప్పారు.

బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణింపు


విజేతగా నిలిచిన వేద పాఠశాల క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె సిటీ: మహిళలు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా అస్మిత అండర్–17 బాలికల ఫుట్‌బాల్ లీగ్‌ల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో మొట్టమొదటిసారిగా ఖేలో ఇండియా బాలికల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు దిలీప్ కుమార్, మురళీధర్ మాట్లాడుతూ బాలికల ఫుట్‌బాల్ క్రీడలో గత రెండు సంవత్సరాలుగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఖేలో ఇండియాలో భాగంగా మదనపల్లెలో పోటీలు నిర్వహించడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. గత నెల 27వతేదీ నుంచి పోటీలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆరు టీములు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకమ్మ, నరేష్, ఉమా, తాజ్‌బాషా, భద్రయ్య, చలపతిరెడ్డి, బాలాజీ, భారతి, అంజనప్ప అసోసియేషన్ సభ్యులు మహేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజేత శ్రీవేద పాఠశాల : ఖేలో ఇండియా అస్మిత అండర్–17 ఫుట్‌బాల్ బాలికల పోటీల్లో శ్రీవేద పాఠశాల (మదనపల్లె) జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానం వశిష్ఠ పాఠశాల (మదనపల్లె) జట్టు గెలుపొందింది. విజేతలకు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ట్రోఫీ, మెడల్స్ బహూకరించారు. ప్రథమ బహుమతి రూ.50 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.30 వేల నగదు అందజేశారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ట


శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ మద్దూరివాండ్లపల్లెలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. గ్రామస్తులు, మదనపల్లె మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి ఆహ్వానం మేరకు.. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీలో మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్.ప్రకాష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి నిసార్‌అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి, ప్రజల మద్దతును కూడగట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ కేశవరెడ్డి, ఎస్.ఏ.కరీముల్లా, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యం.. దేశానికి సౌభాగ్యం

పీలేరు : బాలల ఆరోగ్యమే దేశానికి సౌభాగ్యమని ఎంపీడీఓ శంకరయ్య, డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం నుంచి 1–19 సంవత్సరాల పిల్లలకు విధిగా నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్, పద్మావతి, సీడీపీఓ రాజమ్మ, యంపీహెచ్‌ఈఓ .జయలక్ష్మి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

ములకలచెరువు : సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సాయిలీలా అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలకు తీర్మానం చేశారు. ఉపాధి హామీ పనులు తమకు సమాచారం ఇవ్వకుండా చేసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ సర్పంచులు ఉపాధి సిబ్బందిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించాలని ఎంపీడీఓ హరినారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


చికిత్స పొందుతున్న వెంకటశివారెడ్డిని పరామర్శిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం): తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న పలువురిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించి, వారికి మెరుగైన వైద్య సేవలందివ్వాలని వైద్యాధికారులకు సూచించారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం తాళ్ళపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి తండ్రి వెంకటశివారెడ్డి అనారోగ్యంతో స్విమ్స్ ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. అక్కడికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ఆరోగ్య స్థితిపై వైద్యులను విచారణ చేశారు. అలాగే జర్రావారిపల్లికి చెందిన రెడ్డిరాజా కుమార్తె హర్షిత అదే ఎమర్జెన్సీ వార్డులో ఉండటంతో ఆమె ఆరోగ్య స్థితిపై కుటుంబ సభ్యులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి ఎస్వీ నగర్‌లో నివాసం ఉంటున్న ఎకేయూ మాజీ వీసీ వెంకటరెడ్డిని, కేవీపల్లి మండలం సొరకాయలపేట(మినుమురెడ్డిగారిపల్లి)కి చెందిన రాస్ మల్లికార్జునరెడ్డిలను తిరుపతిలో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.

కల్పవృక్ష వాహనంపై వెంకన్న


కల్ప వృక్షవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, రమేష్ బాబు, ధనుష్, క్రిష్ణమూర్తిలు శుక్రవారం స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకం అలంకరించి ఊరేగించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి ఊరేగింపు నిర్వహించారు. కల్పవృక్షవాహనంపై స్వామిని భక్తులు దర్శించి తరించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో భక్తులను అలరింపజేశారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐగా సత్యనారాయణ


సత్యనారాయణ

మదనపల్లె : మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐగా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రమేష్ నాయుడు ఏసీబీ అధికారులకు పట్టుబడగా, జిల్లా ఎస్‌బి సిఐ గా ఉన్న సత్యనారాయణ ను మదనపల్లి రూరల్ సర్కిల్ బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సిఐ విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు సంబంధించి ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో నేరాలు కట్టడి చేస్తామన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

రమాబాయి జీవితం.. ఆదర్శనీయం


రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జీవితం ఆదర్శనీయమని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున అన్నారు. శుక్రవారం రమాబాయి 127వ జయంతిని పురస్కరించుకొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు నాయకులు సుభాష్, దుర్గాప్రసాద్, కుశల్ కుమార్, లక్ష్మీ, చెంగమ్మ, రత్నమ్మ, రెడ్డెమ్మ, సరస్వతి, స్వాతి, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ గదుల వేలం

మదనపల్లె : మున్సిపాలిటీకి చెందిన షాపు రూములకు నిర్వహించిన బహిరంగ వేలంలో 14 రూములకు సంబంధించి రూ.1లక్ష55వేల500 ఆదాయం లభించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో 66 షాపురూములకు బహిరంగ వేలం నిర్వహించారు. అందులో 14 షాపురూములకు హెచ్చుపాట పాడి సొంతం చేసుకున్నారు. మిగిలిన 52 షాపురూములకు వేలం పాటల్లో పాల్గొనేందుకు ఎవరూ రాలేదు. దీంతో వాటికి సంబంధించి ఈ నెల 14న మరోసారి బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో విజయకుమార్, ఆర్ఐ శ్రీనివాసులు, ఏ1 రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.1.18 లక్షల ఆదాయం

కేవీపల్లి: మండలంలోని కేవీపల్లి గ్రామ పంచాయతీకి చేపలచెరువుల వేలం ద్వారా రూ.1.18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. కేవీపల్లి పంచాయతీ పరిధిలోని తొమ్మిది చెరువులలో చేపలు పట్టుకోవడానికి శుక్రవారం వేలం పాట నిర్వహించగా ఔత్సాహికులు పాల్గొనడటంతో రూ.1.18 ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మదనపల్లె : నియోజకవర్గంలోని నీటిసమస్యకు శాశ్వతపరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెలిగల్లు ప్రాజెక్ట్ నుంచి మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు 3,200 కోట్లుతో డీపీఆర్ సిద్ధమైందన్నారు. మార్చిలో పనులకు టెండర్ పిలవనున్నామన్నారు. దీనిద్వారా మదనపల్లె నియోజకవర్గంలోని 640 గ్రామాల్లో ప్రతి పల్లెకు ఒక ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్ పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. మదనపల్లె ఆటోనగర్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. చిత్తూరుబస్టాండ్ బీటీ వెల్‌కం హోమ్ నుంచి డీఎస్పీ బంగ్లా వరకు 100 అడుగుల రోడ్డుగా మార్పుచేయాలని ప్రణాళిక సిద్ధం చేసి సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. మదనపల్లె జిల్లా అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, 300 కోట్లతో పట్టణానికి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అనుమతి ఇచ్చారన్నారు. బీటీ కళాశాలకు యూనివర్శిటీ హోదా, టమాటా ప్రాసెసింగ్ యూనిట్ తీసుకువస్తామన్నారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ప్రైవేటీకరణ కాకుండా చూస్తామన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో మారుస్తున్నామన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.జే.వెంకటేష్, పోతబోలు సుధాకర్, శ్రీరామ వినోద్, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.